సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

గురువారం । 15 । జూన్ । 2023



చీనీ టన్ను రూ.38 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.38 వేలు పలికాయి. మార్కెట్‌కు 1,000 టన్నుల కాయలు అమ్మకానికి వచ్చాయి.



'నితిన్‌సాయి' పనుల తనిఖీ

నితిన్‌సాయి కన్‌స్ట్రక్షన్స్ ఆధ్వర్యంలో చేపట్టిన రోడ్ల నిర్మాణాలను అధికారులు బుధవారం పోలీసు బందోబస్తు మధ్య తనిఖీ చేశారు.

4లో

గరిష్టం/కనిష్టం
39.4°/ 22.1°

జిల్లాలో బుధవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. గాలివేగం స్వల్పంగా పెరిగింది. మధ్యాహ్నం తర్వాత ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఒకట్రెండు చోట్ల తేలికపాటి వర్షం కురిసింది.

న్యూస్‌రీల్

భూ సేకరణ వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న జేసీ టీఎస్ చేతన్

పుట్టపర్తి అర్బన్: జిల్లా ఏర్పాటవుతున్న 544డీ, 342, 716జీ రహదారులకు భూ సేకరణ ప్రక్రియ జాయింట్ కలెక్టర్ టీఎస్ చేతన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన కలెక్టరేట్‌లోని కోర్టు హాలులో వివిధ శాఖల అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ, భూసేకరణ తర్వాత రైతుల బ్యాంకు ఖాతాల వివరాలను త్వరితగతిన అందిస్తే వారికి పరిహారం ఇచ్చేందుకు వీలుంటుందన్నారు. భూ సేకరణ ఎంత ముఖ్యమో ఖాతాల వివరాలు సేకరించడం అంతే ముఖ్యమన్నారు. సమావేశంలో ఆర్డీఓ భాగ్యరేఖ, సర్వే ల్యాండ్ అండ్ రికార్డ్స్ ఏడీ రామకృష్ణ, జిల్లా ఉద్యానశాఖ అధికారి చంద్రశేఖర్, నేషనల్ హైవే అధికారులు, పలువురు తహసీల్దార్లు పాల్గొన్నారు.

మిగులు సీట్లకు 20న పరీక్ష



లేపాక్షి: మహాత్మా జ్యోతిబాపూలే బీసీ గురుకుల పాఠశాలల్లో 6, 7, 8, 9 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి ఈ నెల 20న రాత పరీక్ష నిర్వహించనున్నట్లు జిల్లా కన్వీనర్ ప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బాలికలకు టేకులోడు, గుడిబండ, బుక్కపట్నం, నసనకోట, బాలురకు లేపాక్షి, రొద్దం-1, రొద్దం-2, గుండుమల, పేరూరు, రేగాటిపల్లి పాఠశాల్లో పరీక్ష ఉంటుందన్నారు. ప్రవేశ పరీక్ష 20వ తేదీ ఉదయం 11 గంటల నుంచి 12.30 గంటల వరకు ఉంటుందన్నారు. విద్యార్థులు గంట ముందే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. 6, 7 తరగతులకు రాత పరీక్ష తెలుగులో 10 మార్కులు, ఇంగ్లిష్ 10, గణితం 15, ఎన్విరాన్మెంటల్ స్టడీస్‌లో 15 మార్కులకు ఉంటుందని వివరించారు. 8, 9 తరగతులకు తెలుగులో 5 మార్కులకు, ఇంగ్లిష్ 10, గణితం 15, సైన్సు 10, సోషల్, జనరల్ నాలెడ్జ్ కలిపి 10 మార్కులకు ప్రశ్నపత్రం ఉంటుందని తెలిపారు. ప్రతిభ ఆధారంగా అర్హత సాధించిన విద్యార్థులను ప్రవేశాలు కల్పిస్తామన్నారు.

ర్యాంకు మెరిసె..విద్యార్థి మురిసె!



అగ్రికల్చర్, ఫార్మసీ విభాగంలో జిల్లా టాపర్ మరియప్పగారి నిక్షేప్‌కు స్వీట్ తినిపిస్తున్న తల్లిదండ్రులు

- ఏపీఈఏపీసెట్‌లో సత్తా చాటిన జిల్లా విద్యార్థులు
- ఇంజినీరింగ్ విభాగంలో రాష్ట్ర స్థాయిలో 40వ ర్యాంకు సాధించిన కిషన్‌తేజా
- మరియప్పగారి నిక్షేప్‌కు అగ్రికల్చర్ - ఫార్మసీ విభాగంలో రాష్ట్ర స్థాయిలో 57వ ర్యాంకు
- టాప్-500 ర్యాంకుల్లో ఆరుగురికి చోటు

ప్రశాంతి నిలయం: ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ, బీఎస్సీ (నర్సింగ్) కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన ఏపీ ఈఏపీసెట్-2023లో జిల్లా విద్యార్థులు సత్తా చాటారు. బుధవారం వెలువడిన ఫలితాల్లో మెరుగైన ర్యాంకులు సాధించి ప్రతిభ చాటుకున్నారు. ఇంజినీరింగ్‌లో కొత్తచెరువు మండలం బైరాపురం గ్రామానికి చెందిన దేవాంగం కిషన్ తేజ్ 146.135 మార్కులు సాధించి 40వ ర్యాంక్‌ను సాధించాడు. అగ్రికల్చర్ - ఫార్మసీ విభాగంలో కదిరి ఆర్‌ఎస్ రోడ్డుకు చెందిన మరియప్పగారి నిక్షేప్ 136.419 మార్కులతో 57వ ర్యాంకుతో మెరిశాడు. జిల్లా వ్యాప్తంగా ఇంజినీరింగ్ మొత్తం 934 మంది దరఖాస్తు చేసుకోగా 896 మంది పరీక్షకు హాజరయ్యారు, 646 మంది అర్హత సాధించారు. అగ్రికల్చర్ - ఫార్మసీ విభాగంలో 423 మంది దరఖాస్తు చేసుకోగా, 394 మంది పరీక్షకు హాజరయ్యారు, 338 మంది అర్హత సాధించారు.

అగ్రికల్చర్, ఫార్మా విభాగంలో జిల్లాలో మొదటి పది స్థానాల్లో నిలిచిన విద్యార్థుల వివరాలు

విద్యార్థి పేరు	ర్యాంక్	ప్రాంతం
మరియప్పగారి నిక్షేప్	57	కదిరి
సుద్దాల ప్రశాంత్	280	నల్లచెరువు
ఎన్.మోహిత్	332	అమరాపురం
జి.టి.రాజు	422	అమరాపురం
టి.లితీష్ కుమార్ రెడ్డి	441	ఓడీసీ
మధు చేతన	933	హిందూపురం
సూరపాక సుష్మాంజలి	953	పుట్టపర్తి
పాళ్యం దీప్తి	974	తనకల్లు
మల్లెల నందిని	1,040	గోరంట్ల
ఎస్ఆర్ ప్రణతి	1,075	గుడిబండ

ఇంజినీరింగ్ విభాగంలో జిల్లాలో మొదటి పది ర్యాంక్‌లు సాధించిన వారి వివరాలు

విద్యార్థి పేరు	ర్యాంక్	ప్రాంతం
దేవాంగం కిషన్ తేజ్	40	కొత్తచెరువు
ఈక్షిత్ సాయి గుణ్‌కర్	611	చెన్నేకొత్తపల్లి
మేక భవ్య కుమారి	741	కదిరి
నాగసాయి సాత్విక్	884	హిందూపురం
గూడూరు సూరజ్	1,275	పెనుకొండ
చంద్రప్పగారి చైతన్య	1,377	అమరాపురం
కనికరం యోజిత	1,420	కదిరి
నిత్య సహస్ర	1,525	హిందూపురం
బడా మోక్షసాయిరెడ్డి	1,594	నల్లమాడ
గుర్రం పవన్ కార్తికేయ	1,692	ధర్మవరం

సివిల్స్ సాధించడమే లక్ష్యం



మానాన్న దేవాంగం ఈశ్వరప్ప ఉపాధ్యాయుడు. ఆయన్ను స్ఫూర్తిగా తీసుకుని కష్టపడి చదివా. భవిష్యత్తులో ఇంజినీరింగ్ తర్వాత సివిల్స్ సాధించి సమాజానికి సేవ చేయడమే లక్ష్యం. నేను వేగంగా సమాధానాలు రాయడం ఎక్కువగా ప్రాక్టీస్ చేశాను. పరీక్షలో అది నాకు ఎంతో ఉపయోగపడింది.

–దేవాంగం కిషన్ తేజ్, 40వ ర్యాంకర్

కార్డియాలజిస్ట్ అవుతా



ఏపీఈఏపీ సెట్‌లో 57వ ర్యాంక్, నీట్‌లో 700 ర్యాంక్ సాధించా. నా తల్లిదండ్రుల ప్రోత్సాహం, ప్రణాళికా బద్ధంగా చదవటంతోనే మంచి ర్యాంక్‌లు సాధించగలిగా. నీట్‌లో వచ్చిన ర్యాంక్‌తో మెడిసిన్ పూర్తి చేసి, ఎండీ కార్డియాలజీ పూర్తి చేయడమే నా లక్ష్యం. నిరుపేదలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యం.

–మరియప్పగారి నిక్షేప్, 57వ ర్యాంకర్

సమ్రీన్‌కు 30వ ర్యాంక్



కదిరి అర్బన్: ఏపీ ఈఏపీసెట్ ఫలితాల్లో కదిరికి చెందిన ఫైజా సమ్రీన్ 30వ ర్యాంక్ సాధించింది. సమ్రీన్ తండ్రి కదిరి మండలం కొండమనాయునిపాళెం జిల్లా హైస్కూల్ ఉపాధ్యాయుడు కాగా, తల్లి నస్రిన్ తలుపుల మండలంలో ఉపాధ్యాయురాలుగా పనిచేస్తున్నారు. అనంతపురం జిల్లా నుంచి దరఖాస్తు చేసుకున్న సమ్రీన్ భవిష్యత్ వైద్యురాలిగా సేవలందిస్తానని చెబుతోంది.

సాగుకు నాణ్యమైన కరెంటు

- సిబ్బందికి సీఎండీ సంతోషరావు ఆదేశం



మాట్లాడుతున్న సీఎండీ సంతోషరావు

పెనుకొండ: వ్యవసాయానికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా నాణ్యమైన కరెంటు ఇవ్వాలని, రైతులు రిజిస్ట్రేషన్ చేసుకున్న వెంటనే విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేయాలని ఏపీ ఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోషరావు ఆదేశించారు. బుధవారం ఆయన పట్టణంలోని ట్రాన్స్‌కో సబ్‌స్టేషన్‌లో హిందూపురం, పెనుకొండ, మడకశిర ప్రాంతాల సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, వినియోగదారులు ఎలాంటి ఇబ్బంది పడకుండా ఎప్పటికపుడు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. హిందూపురం డివిజన్ పరిధిలో రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులందరికీ వెంటనే నూతన వ్యవసాయ కనెక్షన్లు ఇవ్వాలన్నారు. అనంతరం నిరంతర విద్యుత్ సరఫరా కోసం సబ్‌స్టేషన్లు, 33 కేవీ, 11 కేవీ ఫీడర్ల నిర్వహణపై పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన 'కియా' అధికారులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. కార్యక్రమంలో ఎస్ఈ సురేంద్ర, భూపతి, కె.గురవయ్య, డీఈలు, ఏఈలు, లైన్‌మెన్లు పాల్గొన్నారు.

జూలై 17న ఎస్కేయూ స్నాతకోత్సవం

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయ స్నాతకోత్సవం జూలై 17న నిర్వహించనున్నట్లు వీసీ మాచిరెడ్డి రామకృష్ణారెడ్డి అన్నారు. ఎస్కేయూలో బుధవారం విభాగాధిపతులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో వీసీ మాట్లాడారు. సెమిస్టర్ పరీక్షలు తప్పనిసరిగా ఆగస్టు 16 నుంచి ప్రారంభం కావాలని ఆదేశించారు. జూలై 28 యూనివర్సిటీ ఆవిర్భావ దినోత్సవానికి ఏర్పాట్లు ఘనంగా చేపట్టాలని కోరారు.

అపోహలు వీడండి..రక్తదానం చేయండి

ప్రశాంతి నిలయం: అపోహలు వీడి ఆపదలో ఉన్న వారికి రక్తదానం చేయాలని కలెక్టర్ అరుణ్ బాబు పిలుపునిచ్చారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని పుట్టపర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని కలెక్టర్ ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ, ప్రమాదాల బారిన పడి ప్రాణపాయ స్థితిలో ఉన్న వారిని దాతలు అందించే రక్తమే కాపాడుతుందన్నారు. అందువల్ల ప్రతి ఒక్కరూ అపోహలు వీడి రక్తదానం చేయాలన్నారు. రక్తదానం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుందని, గుండె జబ్బుల ప్రమాదాన్ని నివారిస్తుందని, కేన్సర్ ప్రమాదాన్ని తగ్గిస్తుందని, బరువు తగ్గేందుకు మేలు చేస్తుందని, ఇలా రక్తదానం వల్ల ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని తెలిపారు. అనంతరం 75 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్వీ కృష్ణారెడ్డి, జిల్లా లెప్రసీ, టీబీ అధికారి డాక్టర్ తిప్పయ్య, జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ కృష్ణయ్య, జిల్లా మలేరియా నివారణ అధికారి డాక్టర్ కుళ్లాయప్ప నాయక్, జిల్లా అంధత్వ నివారణ అధికారి డాక్టర్ సి.అనూరాధ, వైద్యాధికారి డాక్టర్ నాగరాజు నాయక్, పలువురు సూపర్‌వైజర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

'నీట్'గా మెరిశారు

- జాతీయ స్థాయిలో సత్తా చాటిన జిల్లా విద్యార్థులు
- కదిరికి చెందిన నిఖిల్‌కుమార్‌కు ఓబీసీ కేటగిరీలో 39వ ర్యాంకు
- గిరివర్షితకు ఉమెన్ కేటగిరీలో 11వ ర్యాంకు
- పెడబల్లితండా విద్యార్థి విష్ణుకు ఎస్టీ కేటగిరీలో 103వ ర్యాంకు
- లోచన్ వెంకట్ చరణ్‌రెడ్డికి 991వ ర్యాంకు



నిఖిల్ కుమార్‌కు స్వీట్ తినిపిస్తున్న తల్లిదండ్రులు



పట్నం నిఖిల్ కుమార్



లోచన్ వెంకట్ చరణ్‌రెడ్డి

కదిరి: జాతీయ స్థాయిలో ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన నీట్ (నేషనల్ ఎలిజిబులిటీ టెస్ట్)- 2023 ఫలితాల్లో జిల్లా విద్యార్థులు సత్తా చాటారు. ఉపాధ్యాయ దంపతులు బిడ్డలు మెరుగైన ర్యాంకులతో మెరిశారు. కదిరి పట్టణానికి చెందిన పట్నం నిఖిల్ కుమార్ 720 మార్కులకు గాను 700 మార్కులు సాధించి ఆల్ ఇండియా స్థాయిలో 218వ ర్యాంకు సాధించాడు. ఓబీసీ కేటగిరీలో 39 ర్యాంకు దక్కించున్నాడు. నిఖిల్‌కుమార్ తండ్రి పట్నం హరి పుట్టపర్తి మండలం చెర్లోపల్లి యూపీ స్కూల్‌లో తెలుగు పండిట్ కాగా, తల్లి భవాని కస్తూర్బా గాంధీ విద్యాలయంలో టీచర్‌గా పనిచేస్తున్నారు. తమ కుమారుడికి నీట్‌లో మంచి ర్యాంకు రావడం పట్ల తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

చరణ్‌రెడ్డికి 991వ ర్యాంకు

కదిరి పట్టణానికే చెందిన దేశిరెడ్డి లోచన్ వెంకట్ చరణ్‌రెడ్డి నీట్‌లో 720కి గాను 680 మార్కులు సాధించి జాతీయ స్థాయిలో 1,594వ ర్యాంకు దక్కించుకున్నాడు. కేటగిరీ స్థాయిలో 991వ ర్యాంకు కై వసం చేసుకున్నాడు. చరణ్‌రెడ్డి తండ్రి డి.రంగారెడ్డి గుండువారిలపల్లి ఉన్నత పాఠశాలలో ఇంగ్లిష్ టీచర్‌కాగా, తల్లి కె.సునీత ఓడిచెరువు మండలం టి.కుంట్లపల్లి పాఠశాలలో సెకండరీ గ్రేడ్ టీచర్‌గా పనిచేస్తున్నారు.

తండా కుర్రాడికి 103వ ర్యాంకు



తల్లిదండ్రులతో విష్ణువర్ధన్ నాయక్

పుట్టపర్తి అర్బన్: 'నీట్' ఫలితాల్లో పెడపల్లితండాకు చెందిన ఉపాధ్యాయుడు హేమ్లానాయక్, పార్వతీబాయి దంపతుల కుమారుడు ఎం. విష్ణువర్ధన్ నాయక్ సత్తా చాటాడు. 610 మార్కులు సాధించి ఎస్టీ కేటగిరిలో జాతీయ స్థాయిలో 103వ ర్యాంకు సాధించాడు. జనరల్ కేటగిరీలో విష్ణుకు 23,352 ర్యాంకు దక్కింది. అలాగే ఏపీ ఈఏపీ సెట్‌లోనూ విష్ణు 103 మార్కులు సాధించాడు.

గిరి వర్షితకు 11వ ర్యాంకు

పుట్టపర్తి మండలం రాయలవారిపల్లి గ్రామానికి చెందిన ఉపాధ్యాయ దంపతులు పురుషోత్తం, సుమతిల కుమార్తె గిరివర్షిత 'నీట్'లో జాతీయ స్థాయిలో 51వ ర్యాంకు సాధించింది. ఉమెన్ కేటగిరీలో 11వ ర్యాంక్ దక్కించుకుంది.

జ్యోతీలాల్ చవాన్‌కు 119వ ర్యాంక్



నల్లమాడ మండల పరిధిలోని నీరాలవంక తండాకు చెందిన మూడే జ్యోతిలాల్ చవాన్ నీట్‌లో 720 మార్కులకుగాను 705 మార్కులు సాధించి సత్తా చాటాడు. జాతీయ స్థాయిలో 119 ర్యాంకు, ఎస్టీ కేటగిరీలో మొదటి ర్యాంక్ సాధించాడు. తండ్రి మూడే శ్రీరాములు నాయక్ వెటర్నరీ డాక్టర్‌కాగా, తల్లి ఆశాబాయి అడ్వకేట్‌గా పనిచేస్తున్నారు.

మాటిచ్చి.. మేలు చేకూర్చి

హామీ నెరవేర్చిన తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

- నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం పరితపిస్తున్నారు
- 25 ఏళ్లుగా మహిళలకు ఎవరూ చేయని మేలును చేశారు
- ఆయన కష్టం వృథాకాదు.. నియోజకవర్గ ప్రజలు అండగా నిలవాలి
- 'అమ్మ సహకార డెయిరీ' ప్రారంభోత్సవంలో జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



ప్రారంభోత్సవ సభకు హాజరైన అక్కచెల్లెమ్మలు



'అమ్మ' డెయిరీని ప్రారంభించిన ఇన్‌చార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, చిత్రంలో మంత్రి ఉషశ్రీచరణ్, విప్ కాపు రామచంద్రారెడ్డి, ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి తదితరులు

రాప్తాడు రూరల్: రాప్తాడు నియోజకవర్గ ప్రజలకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి మాట నిలబెట్టుకున్నారని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. ఎమ్మెల్యే రూ.20 కోట్ల తన సొంత నిధులతో అనంతపురం రూరల్ మండలం ఆలమూరు జగనన్న లేఅవుట్ పక్కన నిర్మించిన 'అమ్మ మహిళా సహకార డెయిరీ'ని బుధవారం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. డీఆర్డీఏ పీడీ నరసింహారెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ మాట నిలబెట్టుకోవడం వెనుక ప్రకాష్‌రెడ్డి ఎంత కష్టపడ్డాడో అర్థం చేసుకోవాలన్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా మహిళా సహకార డెయిరీ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ప్రైవేట్ డెయిరీల దోపిడీని అరికట్టేందుకే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమూల్ డెయిరీని తీసుకొచ్చారన్నారు. రాప్తాడు నియోజకవర్గంలో 25 ఏళ్లుగా మహిళలకు ఎవరూ చేయని మేలును ప్రకాష్‌రెడ్డి చేశారన్నారు. మీరు కూడా ఆయనకు తోడుగా ఉండాలని పిలుపునిచ్చారు.

'అమ్మ' డెయిరీ నలుమూలలా విస్తరించాలి..

రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి కె.వి.ఉషశ్రీచరణ్ మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం మహిళా సాధికారతకు కృషి చేస్తోందన్నారు. రాప్తాడు నియోజకవర్గంలోని మహిళల సంక్షేమం, అభివృద్ధి కోసం ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి పాటుపడుతున్నారు. మహిళలందరూ ఆయనకు అండగా ఉండాలని, 'అమ్మ డెయిరీ' పూర్తిస్థాయిలో విజయవంతమై జిల్లా నలుమూలలా విస్తరించాలని ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి మాట్లాడుతూ 'అమ్మ' డెయిరీ ఏర్పాటు ద్వారా రైతులకు మేలు జరగడంతో పాటు ప్రజలకు నాణ్యమైన పాల ఉత్పత్తులు అందుతాయన్నారు. ఉమ్మడి జిల్లా మొత్తం ఈ నాణ్యమైన 'అమ్మ' పాలనే వినియోగించాలని కోరారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ప్రభంజనం సృష్టిస్తుందన్నారు. టీడీపీకి ఘోర పరాభవం తప్పదని అన్నారు. హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్ మాట్లాడుతూ రాప్తాడు నియోజకవర్గ ప్రజల కోసం ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి రూ.20 కోట్లు ఖర్చు చేసి సహకార డెయిరీ ఏర్పాటు చేశారన్నారు. పాముకు పోసిన పాలు, మట్టిలో పోసిన పన్నీరు, చంద్రబాబు(టీడీపీ)కి వేసే ఓటు వృథా అవుతాయన్నారు. పవన్ కళ్యాణ్ వారాహి యాత్ర చేసినా, లోకేష్ యువగళం పాదయాత్ర చేసినా, ముసలోడు (చంద్రబాబు) కాశీ యాత్ర చేసినా జగన్ జైత్రయాత్రను మాత్రం ఆపలేరని స్పష్టం చేశారు. జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ మహిళల కోసం అనేక సంక్షేమ పథకాలు తీసుకొచ్చారని, ఆయన స్ఫూర్తితో తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి నడుస్తూ 'అమ్మ' డెయిరీ నెలకొల్పారని అన్నారు. తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి మాట్లాడుతూ గతంలో రాప్తాడు నియోజకవర్గంలో కక్షలు, కార్పణ్యాలు ఉండేవని, ప్రకాష్‌రెడ్డి ఎమ్మెల్యే అయిన తర్వాత పరిస్థితి పూర్తిగా మార్చేసి శాంతికుసుమాలు పూయించారన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీలు వై.శివరామిరెడ్డి, మంగమ్మ, మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి, ఏపీ ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, మేయర్ వసీం, మాజీ మేయర్ రాగే పరుశురాం, ఏడీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్ లిఖిత, డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్‌రెడ్డి, అహుడా చైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్, ఉర్దూ అకాడమీ చైర్మన్ నదీమ్ అహ్మద్, రజక కార్పొరేషన్ చైర్మన్ మీసాల రంగన్న, ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ మంజుల, నాటక అకాడమీ చైర్‌పర్సన్ రాగే హరిత, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు తోపుదుర్తి ఆత్మారామిరెడ్డి, తోపుదుర్తి రాజశేఖర్‌రెడ్డి, తోపుదుర్తి చంద్రశేఖర్‌రెడ్డి, వై.మధుసూదన్‌రెడ్డితో పాటు డెయిరీ సభ్యులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

10 వేల మంది అక్కచెల్లెమ్మలకు లబ్ధి

తాను గెలిస్తే సహకార డెయిరీ ఏర్పాటు చేస్తానని ఎన్నికల ముందు ఇచ్చిన హామీని నెరవేర్చా. ఆలమూరు వద్ద 'అమ్మ సహకార డెయిరీ'ని రూ.20 కోట్లతో ఏర్పాటు చేశాం. ఈ డెయిరీని 10 వేలమంది అక్క చెల్లెమ్మలకు అప్పచెబుతున్నాం. వారు నడిపే ఈ డెయిరీలో నాణ్యమైన, స్వచ్ఛమైన పాలను, పాల ఉత్పత్తులను అందిస్తున్నాం. కొనుగోలుదారులు చెల్లించే ప్రతి రూపాయి 10 వేల మంది సభ్యులకు వెళ్తుంది. మధ్యలో ఎక్కడా దళారులు ఉండరు. పెట్టుబడుదారులు లేరు. కార్పొరేట్ కంపెనీలు అసలే లేవు. అమూల్ ఇస్తున్న ధరకంటే ఒక రూపాయి అదనంగా ఇస్తూ పాలను సేకరిస్తాం. జగనన్న ముఖ్యమంత్రి కాక ముందు మూడు శాతం వెన్న ఉన్న ఆవుపాలను లీటరు రూ.20తో కొనుగోలు చేసిన ప్రైవేట్ డెయిరీలు మార్కెట్‌లో మాత్రం రూ.46కు విక్రయించాయి. లీటరుపై రూ.26 లాభాలు పొందాయి. జగనన్న వచ్చిన తర్వాత ఈ దోపిడీని అరికట్టి రైతుకు, వినియోగదారులకు మేలు చేయాలనే ఉద్దేశంతో అమూల్ డెయిరీని తీసుకొచ్చారు. 'అమ్మ' డెయిరీలో మిగిలే సొమ్మంతా ఏడాదికోసారి వాటాలుగా వేసి 10 వేల మంది సభ్యులకు సమానంగా పంచుతాం. ఉమ్మడి జిల్లా అంతటా పాలను విక్రయిస్తాం. రోజుకు లక్ష లీటర్ల నుంచి రానున్న రోజుల్లో పది లక్షల లీటర్ల పాలను సేకరించి జిల్లాలోని రైతులందరికీ అండగా ఉంటాం.



– తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, ఎమ్మెల్యే

క్లుప్తంగా

పోలీసు బందోబస్తు నడుమ 'నితిన్ సాయి' పనుల తనిఖీలు



కొలతలు తీస్తున్న అధికారులు

ముదిగుబ్బ: నితిన్ సాయి కన్‌స్ట్రక్షన్ ఆధ్వర్యంలో చేపట్టిన రోడ్డు పనుల తనిఖీ ప్రక్రియ కొనసాగుతోంది. ఇటీవల భూగర్భ గనుల శాఖ విజిలెన్స్ ఏడీ విజయలక్ష్మి ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టిన సమయంలో నితిన్ సాయి కన్‌స్ట్రక్షన్‌కు చెందిన కొందరు గుండాయిజం చేసి అధికారులను భయపెట్టిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో బుధవారం ఉదయం పోలీసుల బందోబస్తుతో అధికారులు తనిఖీలు కొనసాగించారు.

రిమాండ్‌కు 17 మంది

యల్లనూరు: ఘర్షణ కేసులో 17 మందిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వేణుగోపాల్, ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు. బుధవారం ఉదయం వారు విలేకరులతో మాట్లాడుతూ.. యల్లనూరు మండలం బొప్పేపల్లిలో ఆదివారం జరిగిన పెద్దమ్మ జాతరలో రెండు సామాజిక వర్గాలకు చెందిన వారు ఘర్షణ పడిన విషయం తెలిసిందే. సోమవారం ఉదయం మరోసారి రెండు వర్గాలు ఒకరిపై ఒకరు సవాల్ విసురుకుని రాళ్లు, కర్రలతో పరస్పర దాడులు చేసుకున్నారు. బాలశివ, ఓబులేసు, వీరప్రసాద్ తీవ్రంగా గాయపడ్డారు. ఘటనకు సంబంధించి అప్పట్లో పరస్పర ఫిర్యాదుల మేరకు ఇరు వర్గాలకు చెందిన పలువురిపై పోలీసులు కేసులు నమోదు చేశారు. విచారణ అనంతరం బుధవారం ఉదయం 17 మందిని అరెస్ట్ చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

ఎస్కేయూ పురోగతికి భ'రూసా'

- రూసా పథకం కింద రూ.20 కోట్ల నిధులు
- నూతనంగా రెండు హాస్టళ్ల నిర్మాణం
- రిపేరీలు, క్యాంపస్ సుందరీకరణ సైతం..
- కొత్త పరికరాలు, డిజిటల్ తరగతుల ఏర్పాటు



ఎస్కేయూ ప్రధాన ద్వారం

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం (ఎస్కేయూ) పురోగతికి రూసా (రాష్ట్రీయ ఉచ్చతార్ శిక్షా అభియాన్) పథకం అండగా నిలిచింది. నాణ్యమైన పరిశోధన, బోధనాభ్యాసన పెంపుదల, ఉత్తమ ఆవిష్కరణలకు దోహదం చేయడానికి రూసా పథకం తోడ్పాటునందిస్తోంది. కేంద్ర ప్రభుత్వం 60 శాతం వాటా, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం వాటాతో నిధులు జమ చేస్తాయి. ఎస్కేయూకు రూ.20 కోట్ల నిధులు రూసా పథకం కింద మంజూరయ్యాయి. నాలుగు రకాల మౌలిక సదుపాయాలు కల్పించడానికి ఈ నిధులు వెచ్చించారు. ఇందులో మొత్తం రూ.14 కోట్లు ఖర్చు చేయగా, తక్కిన రూ.6 కోట్లు వ్యయం చేయాల్సి ఉంది.

నూతన భవనాలు అందుబాటులోకి

క్యాంపస్‌లో నూతనంగా ఉమెన్స్ హాస్టల్, మెన్స్ హాస్టల్ నిర్మించారు. ఉమెన్స్ హాస్టల్‌ను 50 గదుల నిర్మాణంతో రూ.3.25 కోట్లు, మెన్స్ హాస్టల్ నిర్మాణానికి రూ.3.25 కోట్లు ఖర్చు చేశారు. అకడమిక్ భవనంలో టాయిలెట్ బ్లాక్స్ ఏర్పాటుకు రూ.50 లక్షలు వెచ్చించారు. నూతన నిర్మాణాలకు రూ.7 కోట్లు ఖర్చు చేశారు. నీటి నిల్వకు రూ.53.50 లక్షలతో సంపులు నిర్మించారు. పైప్‌లైన్ నిర్మాణానికి రూ.48 లక్షలు కేటాయించారు. డ్రెయినేజీ, స్వీజ్ లైన్స్ రూ.1.21 కోట్లు, ఆల్టర్నేటివ్ ఎనర్జీ రిసోర్సెస్‌కు రూ.1.45 కోట్లు, క్యాంపస్ సుందరీకరణకు రూ.40 లక్షలు, లైబ్రరీ భవనం రిపేరీలకు రూ.50 లక్షలు, 7 హాస్టళ్లలో మరుగుదొడ్లు మరమ్మతులకు రూ.1.59 కోట్లు, ల్యాబోరేటరీల మరమ్మతులకు రూ.43 లక్షలు ఖర్చు చేయనున్నారు.

- మొబైల్ ల్యాబోరేటరీ స్టూడెంట్స్ ఫీల్డ్ విజిట్‌కు రూ.కోటి, మాయిచుర్ కంటెంట్ ఇన్ సాయిల్‌కు రూ.25లక్షలు, స్పెసిఫిక్ ఐఓఎస్ ఎలక్ట్రోమీటర్‌కు రూ.10 లక్షలు, డిజిటలైజేషన్ వర్క్ ఇన్ లైబ్రరీకి రూ.21.83 లక్షలు, క్యాంపస్ నెట్‌వర్క్‌కు రూ.8.80 లక్షలు, వైఫై సౌకర్యానికి రూ.31.22 లక్షలు, సెంట్రల్ కంప్యూటర్ కోసం రూ.1.74 కోట్లు, 3 డిజిటల్ తరగతి గదులకు రూ.80లక్షలు, క్రీడా పరికరాలకు రూ.17.96 లక్షలు, మల్టీమీడియా స్టూడియో సెంటర్ ఏర్పాటుకు రూ.1.15 కోట్లు వెచ్చించనున్నారు.

యూనివర్సిటీ అభివృద్ధికి చర్యలు



ఎస్కేయూ అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకుంటున్నాం. నాణ్యమైన పరిశోధనలు, పటిష్టమైన బోధనాభ్యాసన ప్రక్రియ జరిగేలా కృషి చేస్తున్నాం. రూసా నిధులతో అభివృద్ధి కార్యక్రమాలు త్వరితగతిన నిర్వహించేలా చర్యలు చేపట్టాం. త్వరలో వచ్చే న్యాక్ గ్రేడింగ్‌లోనూ మెరుగైన ర్యాంకు రావాలని కృషి చేస్తున్నాం.

– ప్రొఫెసర్ మాచిరెడ్డి రామకృష్ణారెడ్డి, వీసీ, ఎస్కేయూ

న్యాక్ గ్రేడింగ్ మెరుగుదల అయితే..

నేషనల్ అసెస్‌మెంట్ అక్రిడిటేషన్ కౌన్సిల్ (న్యాక్) గ్రేడింగ్‌ను బట్టి రూసా నిధులు మంజూరు చేస్తుంది. న్యాక్‌లో ఏ గ్రేడ్ వస్తే రూ.40 కోట్ల నిధులు రూసా పథకం నుంచి అందనుంది. ప్రస్తుతం ఎస్కేయూకు న్యాక్ బీ గ్రేడ్ ఉండడంతో రూ.20 కోట్ల నిధులు అందాయి. తాజాగా న్యాక్ గ్రేడింగ్‌కు వెళ్లారు. న్యాక్‌లో గ్రేడింగ్ మెరుగుదల అయి ఏ గ్రేడ్ వస్తే రూ.40 కోట్ల నిధులు అందుతాయి. వచ్చే 5 సంవత్సరాలకు ఈ నిధులు ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో న్యాక్‌లో మెరుగైన పాయింట్లు వచ్చేందుకు వీలుగా చర్యలు తీసుకున్నారు. ఇందులో భాగంగానే క్యాంపస్ సుందరీకరణకు చర్యలు చేపట్టారు.

అర్జీల సత్వర పరిష్కారానికే 'జగనన్న సురక్ష'



వీసీలో పాల్గొన్న కలెక్టర్ అరుణ్‌బాబు, జేసీ చేతన్

- కలెక్టర్ అరుణ్‌బాబు

పుట్టపర్తి అర్బన్: ప్రజా సమస్యలను సత్వరం పరిష్కరించే క్రమంలో భాగంగా ఇప్పటికే అమలు చేస్తున్న 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమానికి అనుబంధంగా 'జగనన్న సురక్ష' కార్యక్రమాన్ని ఈనెల 23న ప్రారంభించనున్నట్లు కలెక్టర్ అరుణ్‌బాబు తెలిపారు. బుధవారం తాడేపల్లి నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్ నుంచి కలెక్టర్ అరుణ్‌బాబు, జాయింట్ కలెక్టర్ చేతన్, డీఆర్‌ఓ కొండయ్య, అడిషనల్ ఎస్పీ విష్ణు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ మధులత తదితరులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, నిర్ణయించిన తేదీల్లో మండల, సచివాలయ పరిధిలో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి 'జగనన్న సురక్ష' కార్యక్రమంలో భాగంగా అర్జీలకు అక్కడికక్కడే పరిష్కారం చేయాలన్నారు. ఇందుకు జూన్ 23వ తేదీలోపు కార్యాచరణ సిద్ధం చేయాలన్నారు. అలాగే 'గడపగడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమంలో గుర్తించిన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధి కూలీలకు రోజూ రూ.270 కూలి వచ్చేలా పనులు కల్పించాలన్నారు. జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు వేగవంతమయ్యేలా చూడాలన్నారు.

నాణ్యమైన విత్తనాలు పంపిణీ చేయాలి

ఖరీఫ్‌లో రైతులకు నాణ్యమైన విత్తనాలు అందజేయాలని కలెక్టర్ ఆదేశించారు. అలాగే సాగునీటి విడుదలకు కార్యాచరణ ప్రణాళిక ప్రకటించాలన్నారు. కౌలు రైతులకు సీసీఆర్‌సీ కార్డులు అందజేసి పెద్ద ఎత్తున రుణాలు మంజూరు చేయాలన్నారు. అలాగే 'జగనన్న భూ హక్కు, భూరక్ష' పథకం కింద చేపట్టిన రెండో దశ పనులు నిర్ణీత సమయంలో పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఓ విజయ్ కుమార్, హౌసింగ్ పీడీ చంద్రమౌళిరెడ్డి, పీఆర్ ఏసీ గోపాల్‌రెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు, ఏడి రామకృష్ణ, నోడల్ ఆఫీసర్ శివారెడ్డి, ఏపీఎంఐపీ పీడీ సుదర్శన్, ఏపీఎస్పీడీసీఎల్ డీఈఈ మోసెస్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి అంజలి తదితరులు పాల్గొన్నారు.

బోధనాస్పత్రిని తనిఖీ చేసిన ఎన్‌ఎంసీ



రేడియాలజీ విభాగం హెచ్‌ఓడీ డాక్టర్ సురేష్‌తో మాట్లాడుతున్న ప్రొఫెసర్ డాక్టర్ జెర్నైల్‌సింగ్‌బావా

అనంతపురం క్రైం: ఫార్మకాలజీ విభాగానికి పీజీ సీట్ల పెంపు, రేడియాలజీ విభాగానికి పీజీ సీట్ల కేటాయింపు కోసం నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్‌ఎంసీ) ప్రతినిధులు బుధవారం అనంతపురం బోధనాస్పత్రి(సర్వజనాస్పత్రి-వైద్యకళాశాల)ని తనిఖీ చేశారు. ఎన్‌ఎంసీ ప్రతినిధులు తమిళనాడుకు చెందిన ప్రొఫెసర్ డాక్టర్ సీతామహాలక్ష్మి ఫార్మకాలజీ, మహారాష్ట్రకు చెందిన ప్రొఫెసర్ జెర్నైల్‌సింగ్ బావా రేడియాలజీ విభాగాన్ని అణువణువూ పరిశీలించారు. రేడియాలజీ విభాగానికి సంబంధించి ప్రొఫెసర్ డాక్టర్ జెర్నైల్‌సింగ్ బావా మొదటగా ప్రభుత్వ వైద్య కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీదేవితో సమావేశమయ్యారు. అనంతరం సర్వజనాస్పత్రిలో రేడియాలజీ హెచ్‌ఓడీ డాక్టర్ సురేష్‌తో కలసి ఎంఆర్‌ఐ, సిటీ స్కాన్, అల్ట్రాసౌండ్, ఎక్స్‌రే గదులను నిశితంగా పరిశీలించారు. రోజూ ఎంత మందికి సేవలందిస్తున్నారని టెక్నీషియన్లు నాగరాజు, ముకుంద, రాకేష్ తదితరులను ఆరా తీశారు. కొన్నేళ్లుగా రేడియాలజీ వైద్యులందించిన సేవలను తమ సెల్‌ఫోన్, సాఫ్ట్‌కాపీ ద్వారా నమోదు చేశారు. అనంతరం వైద్య కళాశాలలో ఆయా విభాగాల వైద్యుల హెడ్‌కౌంట్ చేశారు. ప్రొఫెసర్ సీతామహాలక్ష్మి ఫార్మకాలజీ (ఔషధశాస్త్రం) విభాగాన్ని పరిశీలించారు. అనంతరం హెడ్‌కౌంట్ చేశారు. ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీదేవి మాట్లాడుతూ మరో వారం రోజుల్లో ఈ విభాగాల పీజీ సీట్లపై స్పష్టత వస్తుందని 'సాక్షి'కి తెలియజేశారు.

రేషన్ బియ్యం పట్టివేత



సీజ్ చేసిన వాహనాన్ని చూపుతున్న విజిలెన్స్, రెవెన్యూ అధికారులు

కనగానపల్లి: మండలంలోని ముక్తాపురం సమీపంలో బుధవారం ఉదయం 45 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అందిన ముందస్తు సమాచారంతో అధికారులు 44వ జాతీయ రహదారిపై ముక్తాపురం వద్ద వాహన తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో అటుగా వచ్చిన మినీ లారీని అడ్డుకుని పరిశీలించగా 45 క్వింటాళ్ల రేషన్ బియ్యం తరలిస్తున్నట్లుగా వెలుగు చూసింది. బియ్యాన్ని స్వాధీనం చేసుకుని రెవెన్యూ అధికారులకు అప్పగించారు. వాహన యజమాని రవికుమార్, బియ్యం వ్యాపారి వెంకటరాముడుపై 6(ఏ) యాక్ట్ కింద కేసు నమోదు చేసి, పోలీసులకు అప్పగించారు. తనిఖీల్లో విజిలెన్స్ ఎస్‌ఐ శేషగిరి, ఎఫ్‌ఆర్‌ఓ యామిని సరస్వతి, మండల రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

కణేకల్లులో వైభవంగా ఊరి దేవర



విశేష అలంకరణలో దర్శనమిస్తున్న గ్రామదేవతలు

కణేకల్లు: దాదాపు 120 ఏళ్ల తర్వాత కణేకల్లులో నిర్వహించిన ఊరి దేవర అంగరంగ వైభవంగా సాగింది. మూడ్రోజుల పాటు జరిగిన దేవర బుధవారంతో ముగిసింది. ఈ సందర్భంగా గ్రామదేవతలైన దేవమ్మ, కొల్లాపురమ్మ ఆలయంలో విశేష పూజలు పెద్ద ఎత్తున జరిగాయి. అతి పురాతనమైన ఊరిదేవర (జాతర) సంప్రదాయాన్ని కొనసాగించాలని 120 ఏళ్ల తర్వాత గ్రామ పెద్దలంతా ఓ నిర్ణయానికొచ్చి విరాళాలకు పిలుపునిచ్చారు. దీంతో స్పందించిన ప్రజలు భారీగా విరాళాలు అందజేసి దేవరను భక్తిశ్రద్ధలతోనిర్వహించేందుకు ముందుకు వచ్చారు. మంగళవారం సాయంకాలం నుంచి అర్ధరాత్రి వరకూ ఆలయానికి భక్తులు పోటెత్తారు. ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, ఏపీఐసీసీ చైర్మన్ మెట్టు గోవిందరెడ్డి ఈ వేడుకకు హాజరయ్యారు. బోనాల ఉత్సవం ముగిసిన తర్వాత బుధవారం వేకువజాము ఒంటి గంటకు అమ్మవారి ఆలయం ఎదుట దేవరపోతును బలిచ్చారు. అనంతరం పొలిని సంప్రదాయం ప్రకారం గ్రామం చుట్టూ సరిహద్దు వరకూ చల్లారు. ఏళ్ల తర్వాత జరిగిన ఈ వేడుకలకు బంధువులు, స్నేహితులు భారీ సంఖ్యలో తరలిరావడంతో కణేకల్లు కిక్కిరిసింది. ప్రతి ఇంట పండుగ వాతావరణం నెలకొంది. ప్రతి ఇంటి ముందు షామియాలను వెలిశాయి. ఒక్కో కుటుంబం నాలుగైదు పొట్టేళ్లను బలి ఇచ్చి బంధువులు, స్నేహితులకు విందు భోజనాలు ఏర్పాటు చేశారు. వైఎస్సార్‌సీపీ కణేకల్లు పట్టణ కన్వీనర్ టీ.కేశవరెడ్డి, జెడ్పీ సభ్యురాలు డి.పద్మావతి, వైఎస్సార్‌సీపీ మండల కార్యదర్శి ఆదినద్దురు చంద్రశేఖర్‌రెడ్డి ఏర్పాటు చేసిన విందు భోజనానికి ప్రజాప్రతినిధులు, అధికారులు, అనధికారులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. వేడుకల్లో మాజీ ఎంపీపీ ఆలేరి రాజగోపాల్‌రెడ్డి, జెడ్పీ మాజీ సభ్యుడు పాటిల్ నాగిరెడ్డి, పీఏసీఎస్ అధ్యక్షుడు పైనేటి తిమ్మప్పచౌదరి, మాజీ అధ్యక్షుడు మారెంపల్లి మారెన్న, మండల జేసీఎస్ కన్వీనర్ హనుమంతరావు, ఎంపీటీసీలు వన్నూరుషా, గొల్ల ఉమ, నాయకులు డాక్టర్ సోమన్న, సాదత్, మారెంపల్లి నాగరాజు, గొల్ల వెంకటేశులు, హెచ్.నాగరాజు, లోకేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నీట్ ఫలితాల్లో ఎక్సెల్ అకాడమీ సంచలనం



నీట్-2023 ర్యాంకర్లు: పి.తరణి, ప్రణీత, ఎస్.వెంకటసాయి భార్గవ్, కె.శ్రీజ, ఎ.వర్ష

అనంతపురం: వైద్యవిద్య కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే జాతీయ అర్హత ప్రవేశ పరీక్ష (నీట్) ఫలితాల్లో కర్నూలుకు చెందిన ఎక్సెల్ అకాడమీ సంస్థ మూడేళ్లుగా సంచలనాలు సృష్టిస్తోంది. సంస్థలో కోచింగ్ తీసుకున్న విద్యార్థులు ప్రముఖ వైద్య విద్యాసంస్థల్లో సీట్లు సాధించి సత్తా చాటు తున్నారు. ఎంబీబీఎస్ సీట్ల సాధనలో అకాడమీ అగ్రగామిగా నిలుస్తోంది. నీట్-2021 ఫలితాల్లో 51 మంది విద్యార్థుల్లో 12 మంది, 2022లో 145 మందికి గాను 28 మంది ఎంబీబీఎస్ సీట్లు సాధించారు. బుధవారం విడుదలైన నీట్-2023 పరీక్ష ఫలితాల్లో 150 మంది విద్యార్థులకు గాను 35 మంది విద్యార్థులు ఎంబీబీఎస్ సీట్లు సాధించే అవకాశం ఉందని ఎక్సెల్ అకాడమీ డైరెక్టర్ టి.చంద్రశేఖర్ తెలిపారు. ఉత్తమ ర్యాంకులు సాధించిన పి.తరణి (598 ర్యాంకు), ప్రణీత (590), ఎస్.వెంకటసాయి భార్గవ్ (583), కె.శ్రీజ (569), ఎ.వర్ష (567) తదితరులను డైరెక్టర్ అభినందించారు.

ఎమ్మెల్యే కారును ఢీకొన్న ద్విచక్ర వాహనం

మడకశిర: మద్యం మత్తులో ముగ్గురు యువకులు మడకశిర ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి కారును ద్విచక్ర వాహనంతో ఢీకొన్నారు. బుధవారం మధ్యాహ్నం ఘటన చోటు చేసుకుంది. మడకశిరలోని ప్రభుత్వాస్పత్రి ఎదుట ఎమ్మెల్యే కారు యూటర్న్ తీసుకుంటుండగా మద్యం మత్తులో ద్విచక్ర వాహనంపై వేగంగా దూసుకొచ్చిన ముగ్గురు యువకులు ఢీకొన్నారు. ఘటనలో ముగ్గురు యువకులూ గాయపడ్డారు. క్షతగాత్రులను సిద్దేశ్వర, పవన్ కుమార్, శివకుమార్‌గా గుర్తించారు. ప్రమాదం జరిగిన వెంటనే శివకుమార్ అక్కడి నుంచి పరారయ్యాడు. తీవ్రంగా గాయపడిన సిద్దేశ్వర, పవన్‌కుమార్‌ను స్థానిక ప్రభుత్వాస్పత్రిలో చేర్పించారు. కాగా, ప్రమాదం జరిగినప్పుడు ఎమ్మెల్యే కారులో లేరు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సీఎం సానుకూలత

- జేఏసీ అమరావతి జిల్లా చైర్మన్ దివాకర్‌రావు



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన దివాకర్‌రావు

అనంతపురం అర్బన్: ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సానుకూలంగా స్పందించారని ఏపీ జేఏసీ అమరావతి జిల్లా చైర్మన్ దివాకరరావు తెలిపారు. బుధవారం ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ.. ఈనెల 13న జేఏసీ రాష్ట్ర చైర్మన్ నేతృత్వంలో తాడేపల్లిలోని సీఎం క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రిని కలిసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఉద్యోగుల డిమాండ్లను సీఎం దృష్టికి తీసుకెళితే.. ప్రాధాన్యత క్రమంలో వాటిని నెరవేర్చేందుకు సానుకూలత చూపారన్నారు.

వృద్ధుడి హత్య

లేపాక్షి: తన భార్య పుట్టింటికి వెళ్లడానికి కారకుడయ్యాడనే అనుమానంతో ఓ వృద్ధుడిని యువకుడు దారుణంగా హతమార్చాడు. పోలీసులు తెలిపిన మేరకు... లేపాక్షి మండలం చోళసముద్రం పంచాయతీ నాగానపల్లికి చెందిన చిన్న నరసింహప్ప (72), కోలార్ లక్ష్మమ్మ దంపతులు. వీరికి సంతానం లేదు. అదే గ్రామానికి చెందిన గోవిందప్ప వరుసకు నరసింహప్పకు అల్లుడవుతాడు. కుటుంబ కలహాల నేపథ్యంలో నెల రోజుల క్రితం గోవిందప్పతో గొడవపడి భార్య సజ్జమ్మ పుట్టింటికి వెళ్లిపోయింది. బుధవారం ఉదయం నాగానపల్లికి వచ్చిన ఆమె భర్త ఇంట్లో లేని సమయంలో లోపలకు వెళ్లి ఆధార్‌కార్డు, బియ్యం కార్డు, ఇతర దస్తావేజులు తీసుకుని తిరిగి పుట్టింటికి వెళ్లిపోయింది. కాసేపటి తర్వాత ఇంటికి చేరుకున్న గోవిందప్ప తన భార్య వచ్చి వెళ్లిన విషయం తెలుసుకున్నాడు. అప్పటికే తన భార్య పుట్టింటికి వెళ్లడానికి చిన్న నరసింహప్పనే కారణమనే అపోహ అతనిలో బలంగా ఉండేది. దీంతో నేరుగా చిన్న నరసింహప్ప ఇంటికి వెళ్లాడు. ఒంటరిగా కనిపించిన నరసింహప్పను బీడీ అడగడంతో ఆయన బీడీ తీసిచ్చేందుకు దృష్టి మరల్చాడు. అదే సమయంలో పక్కనే ఉన్న బండి గుజ్జు తీసుకుని గోవిందప్ప దాడి చేయడంతో నరసింహప్ప అక్కడికక్కడే మృతి చెందాడు. మృతి చెందినట్లు నిర్ధారించుకున్న తర్వాత గోవిందప్ప అక్కడి నుంచి పరారయ్యాడు. హతుడి భార్య లక్ష్మమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

నేటి నుంచి విత్తుకు అదను



- ఏఆర్ఎస్ ప్రధాన శాస్త్రవేత్త సహదేవరెడ్డి
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 7.10 లక్షల హెక్టార్లలో పంటల సాగు
- ఏఆర్ఎస్‌లో అందుబాటులో బ్రీడర్, ఫౌండేషన్ సీడ్స్



డాక్టర్ బి.సహదేవరెడ్డి

అనంతపురం అగ్రికల్చర్: 'ముంగారు' (ఖరీఫ్)లో అన్ని రకాల పంటల సాగుకు గురువారం నుంచి వాతావరణం అనుకూలంగా ఉంది. ఈ మేరకు బుక్కరాయసముద్రం మండలం రేకులకుంటలో ఉన్న వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త (మెట్ట వ్యవసాయం) డాక్టర్ బి.సహదేవరెడ్డి తెలిపారు. ఈ నెల 15 నుంచి జూలై 15వ తేదీ వరకూ వేరుశనగ, పత్తి, ఆముదం, కంది, జొన్న, మొక్కజొన్న, రాగి... తదితర అన్ని రకాల పంటల సాగుకు మేలైన సమయన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడి..

అధికారుల అంచనా మేరకు ఈ ఖరీఫ్‌లో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 7.10 లక్షల హెక్టార్ల విస్తీర్ణంలో పంటలు సాగులోకి వచ్చే అవకాశముంది. ఒకవేళ వర్షాలు కొంత ఆలస్యమైనా జూలై ఆఖరు వరకూ ఎలాంటి ఇబ్బంది లేకుండా విత్తు వేసుకోవచ్చునని శాస్త్రవేత్తలు తెలిపారు. జూన్ 15 నుంచి జూలై ఆఖరులోపు విత్తు వేస్తే పంట దిగుబడులకు ఢోకా ఉండదన్నారు. కాకపోతే ఒకటికి రెండు సార్లు భూమిని దుక్కి చేయాలన్నారు. దీని వల్ల భూమి గుల్లబారి నీటి నిల్వ సామర్థ్యం పెరుగుతుందని, తద్వారా పంట కాలంలో బెట్ట ఏర్పడినా ఇబ్బంది ఉండదని వివరించారు. అలాగే నాణ్యమైన విత్తనం ఎంపిక చేసుకోవాలన్నారు. విత్తన సాంద్రత, విత్తనశుద్ధి, సకాలంలో కలుపు నివారణ, అంతర్‌కృషి లాంటి యాజమాన్య పద్ధతులు పాటిస్తే పెట్టుబడులు తగ్గి అధిక దిగుబడులతో వ్యవసాయం లాభసాటి అవుతుందన్నారు.

అందుబాటులో కొత్త వంగడాలు..

మంచి దిగుబడులు ఇచ్చే కొత్త రకం వంగడాలు, నాణ్యమైన విత్తనాలు వ్యవసాయ పరిశోధనా స్థానంలో అందుబాటులో ఉన్నాయి. అవసరమైన రైతులు నేరుగా పరిశోధనా స్థానానికి వెళ్లి కొనుగోలు చేయవచ్చు. పూర్తి వివరాలకు 94910 90978, 94416 52784, 85559 42733, 99896 25222 లో సంప్రదించవచ్చు.

అందుబాటులో ఉన్న విత్తన రకాలు, ధరలు ఇలా..

విత్తన రకం	ధర (కిలో)
కే-6 వేరుశనగ (బ్రీడర్ సీడ్)	రూ.170
కే-6 వేరుశనగ (ట్రూత్‌ఫుల్ లేబుల్ సీడ్)	రూ.120
విశిష్ట వేరుశనగ (టీసీజీఎస్-1694)	రూ.170
విశిష్ట వేరుశనగ (బ్రీడర్‌సీడ్)	రూ.170
విశిష్ట వేరుశనగ (ట్రూత్‌ఫుల్‌లేబుల్ సీడ్)	రూ.120
కంది (పీఆర్‌జీ-176 - ఫౌండేషన్ సీడ్)	రూ.120
సజ్జ (ఏబీవీ-04 - బ్రీడర్ సీడ్)	రూ.152
సజ్జ (ఏబీవీ-04 - ట్రూత్‌ఫుల్ లేబుల్‌సీడ్)	రూ.75

ఊయలే ఉరి తాడైంది!

- చీర మెడకు చుట్టుకుని బాలుడి మృతి



పవన్ మృతదేహం వద్ద విలపిస్తున్న తల్లిదండ్రులు, బంధువులు

గుంతకల్లు రూరల్: ఊయల కోసం వేసిన చీర ఉరి తాడై ఓ బాలుడి ఉసురు తీసింది. పోలీసుల కథనం మేరకు...అనంతపురం జిల్లా గుంతకల్లు మండలం మొలకలపెంట గ్రామానికి చెందిన శేషయ్య, వాణి దంపతులకు కుమారుడు పవన్ (10), కుమార్తె శిరీష ఉన్నారు. శేషయ్య వ్యవసాయం చేసుకుంటూనే.. ప్రభుత్వం ఇంటింటికీ రేషన్ సరఫరా చేస్తున్న మొబైల్ డిస్ట్రిబ్యూషన్ వాహనం నిర్వహిస్తూ భార్యాపిల్లలను పోషించుకుంటున్నాడు. బుధవారం ఉదయాన్నే రేషన్ పంపిణీకి శేషయ్యతో పాటు భార్య కూడా వెళ్లింది. కుమార్తె శిరీష ఆడుకోవడానికి బయటకు వెళ్లింది. ఇంట్లో ఒక్కడే ఉన్న పవన్ చీరతో వేసిన ఊయలలో ఊగుతూ ఆడుకుంటున్నాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు చీర అతని మెడకు చుట్టుకోవడంతో ఊపిరాడక మృతిచెందాడు. ఆడుకోవడానికి ఇంటికి వచ్చిన ఇరుగూ పొరుగు పిల్లలు గమనించి బాలుడి తల్లిదండ్రులకు తెలియజేశారు. కుమారుణ్ని పోగొట్టుకున్న తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదించారు. కాగా.. పవన్ గుంతకల్లులోని ఓ ప్రైవేటు పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్నాడు. బుధవారం పాఠశాలకు వెళ్లలేదు.